# నగల దుకాణంలో చోరీ

**బెజ్జూర్, నవంబర్ 2, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఏలేశ్వరం జువెలరీ షాపు లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆదివారం ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు. షాపు యజమాని నరేష్ ఇచ్చిన ఫిర్యాదుతో దొంగను పట్టుకోవడానికి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. సంఘటన స్థలంలో సిఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చేశామని పేర్కొన్నారు. షాపులోని సీసీ కెమెరా రికార్డులను సైతం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు పెట్టుకోవాలని సూచించారు.




# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 3, నవంబర్ 2025


# అద్దె శిథిల భవనాలు.. అరకొర వసతులు

**పెంచికల్‌పేట్, నవంబర్ 2, ప్రభాతవార్త**

**ప్రజల సౌకర్యార్థం పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో 2016లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల పరిస్థితి చూస్తే ప్రభుత్వ నిరక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పరిపాలనా సౌకర్యాల విస్తరణలో భాగంగా జిల్లాలోని పెంచికల్ పేట్, లింగాపూర్, చింతలమానేపల్లి మూడు మండలాలను ప్రజల సౌకర్యం కోసం,దూర ప్రాంతాల వారికి ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకే ఈ మండలాల ఏర్పాటు జరిగింది. కానీ ఎనిమిదేళ్లు గడిచిన ఈ మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికి అద్దె, శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో ఈ మండలాలు నేటికీ  అభివృద్ధి వెలుగులు చూడలేకపోతున్నాయి ప్రస్తుతం ఈ మండలాల్లోని పరిపాలనకు ప్రధానమైన తహసీల్దార్, మండల ప్రజా పరిషత్, వ్యవసాయ విద్య, ఇతర శాఖల కార్యాలయాలు అద్దె, శిథిల భవనాల్లోనే కొనసాగుతుండటం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తుంది.**

- ✶ నూతన మండలాల్లో శిథిలావస్థలో ప్రధాన శాఖల కార్యాలయాలు
- ✶ భయాందోళనలో ప్రజలు, అధికారులు
- ✶ శాశ్వత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి





పెంచికల్ పేట్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం అరె సంక్షేమ సంఘం భవనంలో కొనసాగుతుండగా, ఎంపిడిఓ కార్యాలయం ఎస్సి కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. పోలీస్ స్టేషన్, ఎమ్మార్సీ, కెజిబివి పారెస్ట్ శాఖలకు నూతన భవనాలు నిర్మించి ప్రారంభించారు.

★ లింగాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయం పాత జెడ్పిఎస్ఎస్ పాఠశాలలో, ఎంపిడిఓ కార్యాలయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో, వ్యవసాయ శాఖ రైతు వేదికలో కొనసాగుతుంది. పూర్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్ ఉన్నాయి.

★ చింతలమానేపల్లి తహసీల్దార్ కార్యాలయం ప్రభుత్వ పాఠశాలలో,ఎంపిడిఓ కార్యాలయం జిల్లా పరిషత్ పాఠశాలలో, కొనసాగుతుండగా వ్యవసాయ శాఖ రైతు వేదికలో కోనసాగుతుంది. పోలీస్ స్టేషన్, కెజిబివి నూతనంగా నిర్మించి ప్రారంభించారు. పశువైద్య శాల, ఆరోగ్య మిగతా 2లో..

# బిజెపి శ్రేణుల రాస్తారోకో

**తాండూర్, నవంబర్ 2, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఐ.బి.జాతీయ రహదారిపై ఆదివారం బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆపరేషన్ సింధూర్ పై దేశ సైనికులపై చేసిన వ్యాఖ్యలు సైనికులను అవమానించడమేనని అన్నారు. దేశ సైనికులు తమ కుటుంబాలను వదిలేసి దేశం కోసం, దేశ ప్రజల కోసం రాత్రనకా పగలనకా సేవ చేస్తా ఉంటే  సీఎం వారి సేవలను గుర్తించకపోగా, వారిని అవమా నిస్తూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశ సైనికులకు రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీ కృష్ణదేవ రాయలు, నాయకులు పులగం తిరుపతి, సిద్ధం మల్లేష్, పుట్ట కుమార్, మామిడి విగ్నేష్, రేవెల్లి శ్రీనివాస్, రాజేశం,  చందు, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.



# విధి కుక్కల దాడిలో చిన్నారి తీవ్ర గాయాలు

**సారంగాపూర్, ప్రభాతవార్త**



విధి కుక్కల దాడిలో చిన్నారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. బీరవెల్లి గ్రామంలో ఏడాదిన్నర చిన్నారి సయ్యద్ సహాద్‌పై కుక్కలు విరుచుకుపడి డాడీ చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తన ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా కుక్కలు ఆకస్మాత్తుగా దాడి చేసి ముఖ భాగం, తలపై గాయపరిచాయి. తీవ్ర రక్తస్రావంతో చిన్నారిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చిన్నారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. వెంటనే చిన్నారిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థులు ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ, కుక్కల దాడులు రోజురోజుకి పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారి చికిత్సకు అందరూ సహకరింలని గ్రామ ప్రజలు తెలిపినారు. గ్రామంలోని విధి కుక్కలను వేంటనే నివరించాలని మళ్ళీ ఈలాంటి సంఘటన జరుగకుండ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## మంత్రాల అనుమానంతో..

# గొడ్డలితో దారుణహత్య

**తిర్యాని, నవంబర్ 2, ప్రభాతవార్త**



హన్మంత్‌రావు (ఫైల్)

మండలంలోని పీట్టగూడ గ్రామంలో శనివారం రాత్రి దారుణ హత్య సంఘటన చోటుచేసుకుంది. మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో ఓ వ్యక్తిని గొడ్డలితో దాడి చేసి హతమార్చిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. రెబ్బెన సీఐ సంజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగి గ్రామ పంచాయతీ పరిధిలోని పిట్టగూడకు చెందిన హన్మంత్‌రావు (50) శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన సీడాం వినోద్ ఇంటి దగ్గరగా వెళ్తుండగా, అతనిపై మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో వినోద్ మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో వినోద్ గొడ్డలితో హన్మంత్‌రావుపై దాడి చేసి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటనను గమనించిన హన్మంత్‌రావు భార్య బొజ్జబాయి అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఆమెపై కూడా దాడి చేయడానికి యత్నించాడు. ఆమె ప్రాణభయంతో ఇంట్లోకి పరుగెత్తి తలుపు వేసుకుంది.

# అద్దె శిథిల భవనాలు.. అరకొర వసతులు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం ముందునుండే ఉన్నాయి.

### సమావేశాలకు ఇబ్బంది,అరకొర వసతులు...

నూతనంగా ఏర్పాటైన మూడు మండలాల్లో మండల సర్వసభ్య సమావేశాలతో పాటు ప్రభుత్వ పథకాల అమలుపై అవగహన కార్యక్రమాలు, ఉన్నత అధికారులతో జరిగే వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలను అద్దె, శిథిల భవనాల్లో నిర్వహించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. శిథిలమైన, ఇరుకు గదుల్లో ఇబ్బందుల దృష్ట్యా పలు కార్యక్రమాలు రైతు వేదికలలో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఫర్నిచర్ సామాగ్రి కొరతతో పాటు మోలిక వసతులు లేవు. ప్రజలు సైతం రోజు వందల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలోని ప్రధాన కార్యాలయాలకు వస్తుంటారు. కార్యాలయాల ముందు పార్కింగ్ స్థలాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

### శిథిలావస్థలో కార్యాలయాలు...

పెంచికల్ పేట్ మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎస్సి కమ్యూనిటీ భవనంలో,లింగాపూర్ లోని తహసీల్దార్ కార్యాలయం జెడ్పి పాఠశాల భవనంలో, చింతలమానేపల్లిలోని తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు పాత పాఠశాలల భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ భవనాలు దాదాపు 30 ఏళ్ళనాటివి కావడంతో గోడలకు పగుళ్లుపడి, పైకప్పులు ఊడిపడే స్థితికి చేరాయి. వర్షాలు కురిస్తే నీరు చొరబడి రికార్డులు దెబ్బతింటున్నాయి ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయంతో అధికారులు తప్పని పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలు సైతం కార్యాలయాకు వెళ్ళడానికి జక్కుతున్నారు.

### భవనాల నిర్మాణం ఆలస్యం...

శాశ్వత భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం పలుమార్లు నిర్ణయాలు తీసుకున్న నిధుల లేమి, భూ సమస్యల వంటి కారణాలతో కాగితాలకే పరిమితం అయ్యాయి, గతంలో స్థానిక సర్పంచులు ప్రజాప్రతినిధులు పలుమార్లు డిమాండ్ చేసిన ఫలితం కనిపించలేదు.

### అవసరం శాశ్వత భవనాల నిర్మాణం...

పెంచికల్ పేట్, లింగాపూర్, చింతలమానేపల్లి మండలాల్లోని అన్ని ప్రభుత్వ శాఖలకు తగిన మోలిక సదుపాయాలతో కూడిన శాశ్వత భవనాల నిర్మాణం అత్యవసరం. ప్రజల భద్రత, అధికారుల సౌకర్యం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరు మండలాల ప్రజలు కోరుతున్నారు.

### శాశ్వత భవనాలు నిర్మించాలి



**- సోనేరావు, మాజీ సర్పంచ్ జాముల్దరా, లింగాపూర్**

కొత్తగా ఏర్పడిన మండలాలు పరిపాలనను ప్రజలకు చేర వేయడానికి ప్రారంభమయ్యాయి . కానీ 8ఏళ్ళు గడుస్తున్నా అద్దె భవనాల్లోనే కొనసాగుతుండటం శిథిలంగా ఉండటం ఆందోళన కలిగిస్తుంది ప్రభుత్వం ప్రజలు, అధికారుల ఇబ్బందులను గుర్తించి శాశ్వత భవనాలు నిర్మించాలి.

### కొత్త భవనాలు నిర్మించి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి



**- రత్నం పాపయ్య, చింతలమానేపల్లి**

8 సంవత్సరాలుగా శాశ్వత భవనాలు వస్తాయని అధికార ప్రజాప్రతినిధులు అంటున్నారు కానీ ఇప్పటికి అద్దె భవనాల్లో శిథిలంగా ఉన్న కార్యాలయల్లోనే పాలన కొనసాగుతుంది. దింతో పనుల నిమిత్తం కార్యాలయాకు వస్తే ఎప్పుడు ఏమవుతుందోనని భయం కలుగుతుంది. కొత్త భవనాలు నిర్మించి మాకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

## సేంద్రీయ పంటలకు మార్కెట్‌లో అధిక గిరాకీ

**సారంగాపూర్, నవంబర్ 02, ప్రభాతవార్త:**



సేంద్రియ పంటలకు మార్కెట్‌లో అధిక గిరాకీ ఉందని అగ్రిఫాబ్రిక్స్ సంస్థ సీఈఓ మెందు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కౌట్ల(బి)లో అగ్రిఫాబ్రిక్స్ సంస్థ ఆధ్వర్యంలో రసాయన అవశేషాలు లేని వరి ధాన్యాన్ని పండించడం, అలా పండించిన పంటను మార్కెట్ చేయు విధానంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ మెందు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందని మార్కెట్‌లోకి ఎన్నో జీవ సంబంధమైన ఎరువులు చీడ పీడల్ని నియంత్రించేందుకు జీవ నియంత్రణ పద్ధతులు ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాంటివాటిని అగ్రిఫాబ్రిక్స్ సంస్థ రైతులకు తమ డిజిటల్ మార్కెట్ విధానంలో అందుబాటులో ఉంచిందని పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన ఆనంద్ మోడ్రన్ రైస్ మిల్ సూచనల మేరకు మొదట భూసార పరీక్ష నిర్వహించి తదనంతరం సంస్థ సిఫారసు చేసిన విధానంలో ధాన్యాన్ని పండించిన తర్వాత ధాన్యాన్ని ప్రయోగశాలలో పరీక్షి ంచి. రసాయనాలు అవశేషాలు పరిమితికి లోబడి ఉంటే బయటి మార్కెట్ కన్నా ఎక్కువ ధరకు రైతుల వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. సూపర్ ఫైన్ రకాలైన రైతు మిత్ర, జై శ్రీరామ్, అక్షయ, చింటూ రకాలను రైతులు సాగు చేసినట్లయితే వీటికి మార్కెట్ లింకేజ్ కల్పించడమే కాకుండా మార్కెట్ ధరపైన కిలోకి రూపాయినర అదనంగా ఇన్సెంటివ్ రూపంలో ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం కౌట్ల మరియు గొల్లమాడ ఎఫ్.పి.ఓ లు,రైతులు పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ శృతి, కౌట్ల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు భూమారెడ్డి, నర్సా రెడ్డి పాల్గొన్నారు.

## ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి

**ఆదిలాబాద్, నవంబర్ 02, ప్రభాతవార్త:**




వయోవృద్ధులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఆదిలాబాద్ ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా సూచించారు. వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షులు డా. దేవదాసు దేశ్ పాండే అధ్యక్షత ఆదివారం పట్టణంలోని జిల్లా వయోవృద్ధుల సమాఖ్య కార్యాలయంలో శ్రీకృష్ణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్ (లీదీ, ఫిజీషియన్), డాక్టర్ రజిత (లీలీ, గైనకాలజిస్ట్) వయోవృద్ధులకు షుగర్, బ్లడ్ ప్రెషర్ తదితర ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ పెద్దవాళ్ల ప్రతి ఇంటికి ధైర్యం, ఆధారం. పిల్లలు తమ తల్లిదండ్రుల పట్ల ప్రేమ, పర్యవేక్షణతో ఉండి వారికి ఎల్లప్పుడూ అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీనియర్ సిటిజన్ల సమాఖ్య సభ్యులు ఎం. గంగాధర్, రామ్ కులకర్ణి, పళ్ళ సత్యనారాయణ, కే. శివన్న, నీలా కిషన్, భాస్కర్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుడ్రైవర్ నిరక్ష్యపు డ్రైవింగ్‌తో మహిళకు గాయాలు

**జైపూర్, నవంబర్ 02, ప్రభాతవార్త**

మిట్టపెల్లి గ్రామానికి చెందిన మహిళ ఆర్టీసీ బస్ డ్రైవర్ నిరక్ష్యపు డ్రైవింగ్‌తో గాయాల పాలైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుమ్మల రాజక్క మంచిర్యాల నుండి చెన్నూర్ వెళ్లే బస్సు ఎక్కి రాసుపల్లి వద్ద దిగుతుండగా బస్ డ్రైవర్ ఒక్కసారిగా బస్సుని ముందుకు కదిలించడంతో కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో మహిళ కాలుకు తీవ్ర గాయమైందని తెలిపారు.ఆమెను చికిత్స కొరకు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ప్రజలు ఆర్టీసీ బస్ డ్రైవర్‌లు ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేస్తూ, ఆపవలసిన చోట ఆపకుండా దూర ప్రాంతంలో బస్సులు ఆపి ప్రజల ప్రాణులతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై, కండక్టర్ పై చర్యలు తీసుకోవాలని కేసు నమోదు చేయాలని కోరారు.

## సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**తాండూర్ ,నవంబర్ 2, ప్రభాతవార్త :**

ఈనెల 15,16వ తేదీలలో మంచిర్యాల పట్టణంలో జరగనున్న సిఐటియు జిల్లా మూడవ మహాసభలను అందరూ విజయవంతం చేయాలని సీఐటీయు మంచిర్యాల జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, జిల్లా మాజీ అధ్యక్షులు లంకె రవి కోరారు. స్థానిక హమాలీ కార్యాలయంలో ఆదివారం జిల్లా మహాసభలు కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుగుణంగా వారికి లాభాలు చేకూర్చే విదంగా లేబర్ కోడ్స్ అమలు చేయాలని చూస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతు జివో 282 ను తెచ్చిందని, పని గంటలు తగ్గించాల్సిన ప్రభుత్వమే పని గంటలు పెంచుతు కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నదన్నారు.లేబర్ కోడ్స్ రద్దు కై ఐక్య పోరాటాలు నిర్వహించాలని, కార్మికులు పని నివాస ప్రాంతాల సమస్యలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరానికై భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం కోసమే జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాగం రాజారాం, హమాలి సంఘం నాయకులు లక్షుఃఃఃఃణ్, మల్లేష్, శ్రీను, స్వామి, శంకర్, రాగులయ్య, శంకర్, శంకర్, రాగులు, రాజయ్య, తిరుపతి, రమణ, తదితరు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో ఆలయ ముఖద్వారం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభం

**చింతలమానేపల్లి,నవంబర్ 2, ప్రభాతవార్త :**



మండలంలోని కర్జవెల్లి గ్రామంలో ఉన్న ఓంకార ఆశ్రమం రాధాకృష్ణ మందిరానికి కొత్త ముఖద్వారం శనివారం నాడు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభమైంది. ఈ ముఖద్వారం నిర్మాణానికి బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన జనుగరి సుశీల శంకర్ (ప్రైవేట్ టీచర్), జనుగరి కళ్యాణి భార్గవరాముడు దాతలుగా ముందుకు వచ్చారు. ప్రారంభోత్సవం సందర్భంగా దాత దంపతులు వేదపండితుల సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై ఇస్లావత్ నరేష్ ముఖ్య అతిథిగా హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించి రాధాకృష్ణ మందిర యంత్రాన్ని తెరిచారు. ముఖద్వారం దాతలు, భక్త జంటలు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం భక్తి శ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాద విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓంకార ఆశ్రమ పరిసరాలు భక్తి వాతావరణంతో నిండిపోయి, ఆలయ ప్రాంగణం ఒక భక్తి క్షేత్రంలా మారింది.



## సేవాగ్రాం శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఆత్రం సుగుణ

**ఉట్నూర్, నవంబర్ 02, ప్రభాతవార్త**

మహారాష్ట్ర రాష్ట్ర వర్ధా జిల్లాలోని సేవాగ్రాం మహాత్మా గాంధీ ఆశ్రమంలో మహిళా శక్తీకరణ, సామాజిక అంశాలపై ఐదు రోజులపాటు జరిగిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు ఎదగటానికి గాంధీ ఆశయాలను ఆధారంగా తీసుకొని రూపొందించిన ఈ శిక్షణ తరగతులు ఎంతో ప్రేరణాత్మకంగా, మార్గదర్శకంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్రతో పాటు తదితర రాష్టాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెస్రం జాలింశ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, నవంబర్ 02, ప్రభాత వార్త:**

ఇటీవలే నార్నూర్ మండలం గుంజల (భోజ్జు గూడ) ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మెస్రం జాలింశ గుండె పోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం స్వగృహం గుంజాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామస్తులు, తదితరరులు ఉన్నారు.



## శిక్షణలో భాగంగా అఖిల భారత అధికారుల సందర్శన

### - గ్రామంలోని స్థితిగతులపైన అధ్యయనం

**నేరడిగోండ, నవంబర్ 2, ప్రభాతవార్త:**

మండలంలోని కుమారీ గ్రామాన్ని నాలుగు రోజుల గ్రామ స్థితిగతుల అధ్యయనంలో భాగంగా రెండవ రోజు ఐఏఎస్, ఐఈఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఐఎస్ఎస్ శిక్షణాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల జీవన ప్రమాణాలు, గ్రామంలోని స్థితిగతులతో పాటు పలు అంశాలను పరిశీలించారు. అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రం, హరితవనం, ప్రభుత్వ పాఠశాల, ముంచినీటి సరఫరా, క్రీడా ప్రాంగణం తదితర ప్రదేశాలను సందర్శించారు. గ్రామంలో పర్యటిస్తూ గ్రామస్తుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణాధికారులు రిషిత కుమారి, మయాంక్ మద్గల్, ఆశిష్, బిష్ణోయ్, ఆంత్రమదన్, ఓం శుక్లా, ఎంపీడీవో శేఖర్, ఆమ్ నాగోరావ్, ఈ సాయికీర్తన తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### - ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశంలో పిలుపు

**వేమనపల్లి, నవంబర్ 02, ప్రభాతవార్త**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని మాజీ జెడ్పిటిసి ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ ఇరువురు పిలుపునిచ్చారు. ఆదివారం వేమనపల్లిలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఉప్పలపు సాయి కృష్ణ నివాసంలో మండల ముఖ్య నాయకుల, కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు ఇట్టి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసే నాయకుల విజయానికి అందరూ కష్టపడి పని చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. పలు గ్రామాలకు చెందిన కొంత మందినీ కాంగ్రేస్ పార్టీలోకి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇట్టి సమావేశంలో యూత్ కాంగ్రేస్ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీలు ఒడిల రాజన్న, ఆత్రం గణపతి, ఎన్నం సంజయ్య, మాజీ ఎంపీటీసీ అదే శంకర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జహీద్ అలీ, మాజీ సర్పంచులు గాలి మధు, తోకల రాంచందర్, కుబిడే కిష్టయ్య, తిరుపతి రెడ్డి, ఇగురం జగన్, నీకాడి భగవంతు, కొరకొప్పుల మధుకర్ గౌడ్, ఆవులమరి పున్నం నాయకులు పూర్ణచందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మధుసూదన్, చెన్నూరు పురుషోత్తం, కుడికల రాజరాం, శ్రీనివాస్, వినోద్ రెడ్డి, ఉప్పలపు శ్రీనివాస్, తిమ్మన్న, మంత్రి రమేష్, దొబ్బల సంతోష్, బాపు, కొండా రాజేష్, పర్శబోయిన రాము, తోకల తిరుపతి, శ్రీనివాస్, ఎల్లల శేఖర్, దందేరా మహేష్, కుబిడే నానేష్, తుమ్మిడి లచ్చయ్య పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం

## కిడ్నీ సమస్యతో బాధపడుతున్న శంకరమ్మకు విరాళం

**రామకృష్ణాపూర్, నవంబర్ 02, ప్రభాతవార్త**

పట్టణంలోని సాయి బాబా గుడిలో పనిచేస్తున్న చాట్ల శంకరమ్మ కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ సభ్యులు దాతల సహకారంతో 15 వేల రూపాయల విరాళం సేకరించారు. ఆ మొత్తాన్ని సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య చేతుల మీదుగా అందజేశారు. సంస్థ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్ మాట్లాడుతూ, పేదల సహాయానికి ముందుకు వచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అవసరమున్న వారికి ఇలాగే సహాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జంగపల్లి మల్లయ్య, గుడి కమిటీ సభ్యులు బండ అమర్‌నాథ్ రెడ్డి, వైద్య శ్రీనివాస్, మొల్ల రాములు, కాసం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ మోటారుకు మరమ్మతులు

**వేమనపల్లి, నవంబర్ 02, ప్రభాతవార్త**

మండలంలోని సుంపుటం గ్రామపంచాయతీకి మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ లీడర్ దందేర మహేష్ స్పందించి మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు స్కూల్ దగ్గర ఉన్న విద్యుత్ మోటార్ కొద్ది రోజుల క్రితం పాడవ్వడంతో అట్టి విద్యుత్ మోటారుకు సొంత ఖర్చుతో మరమ్మతులు చేసి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు మంచినీరును అందించారు. వీరితో కుబిడే నానేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.





సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 2, ప్రభాతవార్త**

మండలం ఈజ్గాం గ్రామానికి చెందిన సిరిశెట్టి సత్యగౌడ్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పంపిణీ చేయడం చేశారుర. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారిని సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఈజ్గాం గ్రామానికి చెందిన బోర్కుట్ లక్షుుుుుణ్‌ని పరామర్శించారు.

## రేషన్ దుకాణం తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**కాగజ్‌నగర్, నవంబర్ 2, ప్రభాతవార్త**

పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల రేషన్ డీలర్ పద్మావతి రేషన్ షాపును సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుకు వచ్చిన రేషన్ బియ్యాన్ని పరిశీలించి సన్న బియ్యం పంపిణీ జరుగుతున్న సరళిని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షాపు డీలర్ గత కొన్ని నెలలుగా వారికి కమిషన్ రావట్లేదని విషయాన్ని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురావడం జరిగింది. సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా కృషిచేస్తాం

**● సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు**

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 2, ప్రభాతవార్త

అర్హులైన వాళ్లందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేవిధంగా కృషిచేస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో రాసకొండ భాగ్యలక్ష్మి వెంకటేష్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడంతో గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోయాయని, దీంతో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైన్లు, పొలం బాటలు మరియు పైపుడ్ కల్వర్ట్స్ మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులైన వాళ్లందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పుల్ల అశోక్, మాజీ ఎంపిటిసి బికాస్ ఘరామీ, అమిత్ బిశ్వాస్, రణ్వీర్ బిశ్వాస్, లోనారే రవీందర్, తిరుపతి గౌడ్, అరికిల్ల అశోక్, సుమన్, తిరుపతి, వెంకటేష్, నవీన్ గౌడ్, శ్రావణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

సిర్పూర్ (టి),నవంబర్ 2, ప్రభాతవార్త :

ఎంబిబిఎస్ లో సీటు సాధించిన రైతుబిడ్డ విద్యార్థి శ్రావణ్‌ని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సన్మానించారు. సిర్పూర్ మండలంలోని టోంకినీ గ్రామానికి చెందిన హివర్కర్ సాగర్‌సుజాత దంపతుల కుమారుడు శ్రావణ్ కుమార్‌కు ఎంబీబీఎస్ లో సీటు రావడంతో కోనేరు కోనప్ప ఆదివారం వారి నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. ఇదే విధంగా సిర్పూర్ నియోజకవర్గ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఐటీయూ 3వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

**- ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి**

**- సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్**

లక్షెట్టిపేట, నవంబర్ 02, ప్రభాతవార్త

సీఐటీయూ మండలం కన్వినింగ్ కమిటీ సమావేశం లక్షెట్టిపేట మండలం కేంద్రంలోని ఐబీ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు దుంపల రంజిత్ కుమార్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. రాష్టంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు వేతనాలు పెంచుతామని, ప్రతి నెల వేతనాలు చెల్లిస్తామని, పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చింది. నేటికీ ఒక సంవత్సరం గడిచిన రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు మాత్రం అమలు చేయలేదు. నెలలు గడిచిన కార్మికులకు వేతనాలు రాకపోవడంతో కార్మికులు పస్తుల నుండి పనులు చేస్తున్నారు. అయినా కూడా అధికారుల సైతం బెదిరింపులకు పాల్పడుతూ తొలగిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.ఇది సరైనది కాదు. కార్మికులు ఆరోగ్యం బాగాలేక ఉంటే కూడా వేతనాలు కటింగ్ చేస్తూ కార్మికులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కార్మికుల పట్ల అధికారుల వైఖరి సరైంది కాదన్నారు.ఈ నెల నవంబర్ 15, 16న జరిగే సీఐటీయు 3వ జిల్లా మహాసభలు కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లచ్చువ్వ, శంకరవ్వ, సునీత సాగర్, రాజలింగు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

చింతలమానేపల్లి,నవంబర్ 2, ప్రభాతవార్త :



ఇటీవలి వర్షాలు చింతలమానేపల్లి మండలాన్ని తడిసిముద్ద చేశాయి. అయితే ఈ వర్షాలు రైతుల గుండెల్లో మాత్రం బాధను మిగిల్చాయి. మొన్నటిదాకా కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలు పూర్తిగా నీటమునిగి పాడైపోయాయి. కర్జవెల్లి గ్రామానికి చెందిన రైతు లేకురు మల్లయ్య ఒక ఎకరం భూమిని కౌలుకు తీసుకుని చెమటోడ్చి వరి పంట సాగు చేశాడు. కానీ దురదృష్టవశాత్తు అకాలవర్షాల దెబ్బకు పొలం నాలుగు రోజులపాటు నీటిలో మునిగిపోయింది. దాంతో వడ్లు మొలకలు ఎత్తి పాడైపోయాయి. ప్రస్తుతం మల్లయ్య ఆ పాడైన వడ్లను రోడ్ల ఇరువైపులా పేర్చి ఆరబెడుతున్నాడు. తన కష్టానికి ఫలితం లేకుండా పోయిందని వేదనతో చెబుతున్నాడు. అప్పులు తీసుకుని పంట వేసాం, ఇప్పుడు అది మొలకలై పాడైపోయింది. ఇక ఏమి చేయాలో అర్థం కావడం లేదు అని మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామస్థుల ప్రకారం, మండలంలోని మరెందరో రైతులు కూడా ఇలాంటి దుస్థితిని ఎదుర్కొంటున్నారు. వరి పంటలు నీటమునిగిపోవడంతో వ్యవసాయదారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం సహాయక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గైర్హాజరు పేరుతో కార్మికులను తొలగించే కుట్ర

**- హెచ్‌ఎంఎస్ ఏరియావైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు**

తాండూర్, ప్రభాతవార్త



సింగరేణిలో కార్మికులను గైర్హాజరు పేరుతో విధుల నుంచి తొలగించేందుకు సింగరేణి యాజమాన్యం కుట్రలు చేస్తున్నదని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు అన్నారు. గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 150 మాస్టర్లు ఉంటేనే కార్మికులను విధుల్లో కొనసాగించాలని లేని పక్షంలో ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయడమే కాకుండా డిప్రమోషన్స్ చేసి కార్మికులను ఉద్యోగము నుంచి తొలగించే విధంగా యాజమన్యం సర్క్యులర్ ను జారీ చేసిందన్నారు. సర్క్యులర్ పై ఏఐటీయూసీ నాయకులు నోరు మెదపకుండా కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నరని ఆరోపించారు. గతంలో ఏడాదికి 100 మాస్టర్లు ఉన్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ పెట్టి విధులను కొనసాగించే విధంగా చర్యలు చేపట్టేదన్నారు.100 మాస్టర్లు నింపని కార్మికులు 150 మాస్టర్లు ఏ విధంగా హాజరవుతారని యాజమాన్యం వెంటనే సర్క్యులర్ ను రద్దు చేసి పాత పద్ధతిలో కార్మికులకు కౌన్సెలింగ్ పెట్టి విధులు చేసుకునే విధంగా అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులుఓజియర్, శివారెడ్డి, ఇనూస్, ఉమామహేశ్వర్, కిష్టస్వామి, రాజశేఖర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యు మహాసభలను జయప్రదం చేయాలి

లక్షెట్టిపేట, నవంబర్ 02, ప్రభాతవార్త

డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో వరంగల్‌లో జరిగే పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంపై నిరక్ష్యాన్ని వీడాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## అటవీశాఖ ఆధ్వర్యంలో సోదాలు

**- కట్టె కోత మిషన్లు, ఫర్నిచర్ స్వాధీనం**

జన్నారం, నవంబర్ 02, ప్రభాతవార్త

విశ్వసనీయ సమాచారం మేరకు జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజున సోదాలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తాళ్లపేట ,ఇంధనపెల్లి రేంజ్ అధికారులు సుష్మారావు, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రోటి గూడ గ్రామంలో సోదాలు నిర్వహించగా పాలజి సుధాకర్, పాలజి భాస్కర్‌ల ఇంట్లో సోదాలు జరపగా రెండు కట్టెకోత మిషన్లు (3 హెచ్‌పి), 24,500 రూపాయల విలువైన ఫర్నిచర్ స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కలప రవాణా చేసిన, నిలువ ఉంచిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఈ సోదాలలో డిఆర్‌ఓలు సాగరిక, పోషమల్లు, ఎఫ్‌ఎస్‌ఓలు శంకర్, నరేష్, రవి, బీట్ అధికారులు రహీముద్దీన్, సాయి, రవికిరణ్, అనిత, జ్యోతి, కృష్ణమూర్తి, రుబీనా, వెంకటేష్ లవన్ బేస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

**- శ్రీరాంపూర్ ఎస్సై మేకల సంతోష్ కుమార్**

నస్పూర్, నవంబర్ 02, ప్రభాతవార్త

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ ఎస్సై మేకల సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ లో ఆటో, స్కూల్ బస్సు, లారీ డ్రైవర్లకు ప్రయాణికుల రక్షణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఎస్సై మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలని, వాహనాలకు సంబంధిత ధృవ పత్రాలు కలిగి ఉండాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పేర్కొన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని, తొందరపాటుతో నిరక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. వాహన చోదకులు నిరంతరం అప్రమత్తతో ఉండాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, వాహనాల కండిషన్ తరచూ సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

